టీహబ్‌ను సందర్శించిన ఇజ్రాయెల్, యూఎస్‌ఏ బృందాలు



రాయదుర్గం: ఇజ్రాయెల్, అమెరికా నుంచి డెలాయిట్ సంస్థ బృందాలు హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌ను మంగళవారం సందర్శించాయి. పరస్పర సహకారం, ఆవిష్కరణల కోసం టీహబ్‌కు వచ్చారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆవిష్కరణ ఎకోసిస్టమ్ అన్వేషణ, స్టార్టప్‌లకు సహకారం అందించే అంశంపై చర్చించారు. అనంతరం జరిగిన సమావేశంలో క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీస్, సైబర్ సెక్యూరిటీ సెక్టార్‌లకు చెందిన స్టార్టప్‌లు తమ సంచలనాత్మక పరిష్కారాలను ప్రదర్శించారు. అనంతరం టీహబ్ పనితీరు, సౌకర్యాలు, స్టార్టప్‌లను పరిశీలించారు.

హెచ్‌సీయూలో 'ఫొటో కాంటెస్ట్'

యూజీ, పీజీ విద్యార్థులకు పోటీ

రాయదుర్గం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్, ఎస్ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఫొటో కాంటెస్ట్–2024ను నిర్వహిస్తారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో అండర్‌గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ ఫొటో కాంటెస్ట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఇందులో పాల్గొనే వారికి ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తాము తీసిన ఫొటోలను సమర్పించాల్సి ఉంటుంది. ఈ పోటీలలో ముగ్గురు విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, పాల్గొన్నవారందరికీ సర్టిఫికెట్లను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

మెహిదీపట్నం- పటాన్‌చెరు 217ఎం నంబర్ బస్సు సమయాలివే..

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో నుంచి మెహిదీపట్నం- పటాన్‌చెరు 217ఎం నంబర్ బస్సు పటాన్‌చెరులో తెల్లవారుజామున 4.35కి బయలుదేరుతుంది. చివరి బస్సు రాత్రి 20.41కు బయలు దేరుతుంది. ఈ బస్సు మెహిదీపట్నం మీదుగా టోలిచౌకి, రాయదుర్గం, గచ్చిబౌలి,డీఎల్ఎఫ్, హెచ్‌సీయూ, గుల్‌మొహర్‌పార్కు, లింగంపల్లి, అశోక్‌నగర్, రామచంద్రాపురం మీదుగా పటాన్‌చెరుకు వెళుతుంది. ప్రతి 20 నిమిషాలకో బస్సు ఉంటుంది. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి కోరారు.

ఆర్టీసీ మియాపూర్ -2 డిపోలో అద్దెకు బస్సులు

మియాపూర్: పెళ్లిళ్లు, శుభకార్యాలు, పుణ్యక్షేత్ర సందర్శనలు తదితరాల కోసం ఆర్టీసీ మియాపూర్–2 డిపో నుండి బస్సులు అద్దెకు ఇవ్వడం జరుగుతుందని డిపో మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. మియాపూర్, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, దుండిగల్ తదితర ప్రాంత ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వివరాలకు 7382821471, 8106125063, 8008336063, 9959225382 నంబర్లలో సంప్రదించవచ్చు.

మనూలో పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో వీసీ ఐనుల్ హసన్, ప్రొఫెసర్లు

రాయదుర్గం: సూఫీ మతం చాలా ప్రాముఖ్యత కలిగి ఉందని మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళవారం 'మనూ' సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ ద్వారా ప్రచురించిన సర్వీసెస్ ఆఫ్ సూఫియా దక్కన్ ఇన్ ది ప్రమోషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనల్ హార్మోనీ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. భగవంతునితో సన్నిహితంగా ఉండటమే దాని లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మించాలని వినతి



రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: మియాపూర్– సంగారెడ్డి వరకు జాతీయ రహదారి విస్తరణ చేయనున్న నేపథ్యంలో పటాన్‌చెరు డివిజన్ పరిధిలో చేపడుతున్న విస్తరణ పనుల మూలంగా పెద్ద మొత్తంలో వ్యాపార, వాణిజ్య సంస్థల భవనాలు తొలగించాల్సిన పరిస్థితి వస్తోందని, ఇందుకు ప్రత్యామ్నాయంగా పటాన్‌చెరు మీదుగా ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతూ రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు.త్వరలోనే పటాన్‌చెరు పట్టణంలో పర్యటిస్తామన్నారని ఎమ్మెల్యే తెలిపారు.

'ఒరాకిల్'కు ఎంపికైన జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్ సెలక్షన్స్‌లో ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీకి 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒక్కొక్కరికి 19 లక్షల వార్షిక వేతనంతో ఎంపికవడంపై కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్.జి.వి.నర్సింహారెడ్డి హర్షం వ్యక్తం చేయడంతో పాటు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మొత్తం క్యాంపస్ సెలక్షన్స్‌లో 300 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 25 మంది ఎంపికైనట్లు జేఎన్‌టీయూహెచ్ అధికారులు తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి

పటాన్‌చెరుటౌన్: శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ సంజీవరావు అన్నారు.మంగళవారం జిన్నారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

విద్యార్థులు ఎక్కువ.. సౌకర్యాలు తక్కువ

ఇదీ 'లింగంపల్లి హైస్కూల్' దుస్థితి



శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్

హైస్కూల్ వివరాలు..

శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మొత్తం 1285 మంది విద్యార్థులుండగా..

బాలికలు 700 | బాలురు 585

సెక్షన్లు : 20

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అతిపెద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా పిలిచే 'లింగంపల్లి హైస్కూల్'లో సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రతి ఏటా మంచి ఫలితాలు సాధిస్తున్నా వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ పాఠశాలకు సర్వశిక్ష అభియాన్ పథకం ద్వారా, మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా, పలువురు దాతల సహకారంతో వసతులు కల్పించారు.కానీ ఇంకా కొన్ని సమస్యలు విద్యార్థులను వెంటాడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బాత్‌రూంలు, క్రీడా మైదానం, ఒక్క పీఈటీ మాత్రమే ఉన్నారు. ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు చేరువలో ఉన్న ఈ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా మార్చాలని ఆ ప్రాంతవాసులు అంటున్నారు.

ఒక్క పీఈటీతో..

చదువుతోపాటు క్రీడలు, వ్యాయామం కూడా ముఖ్యం. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. కేవలం ఒకే ఉపాధ్యాయుడు ఉండటంతో పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

పాఠశాలలో క్రీడల కోసం గ్రౌండ్‌ను ఏర్పాటు చేయాలి. కాగా స్కూల్‌లో 1285 మంది విద్యార్థులుండగా గ్రౌండ్ తగ్గట్టుగా లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. ఆట స్థలంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంకా బాత్‌రూమ్స్ అవసరం

శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరిన్ని బాత్‌రూమ్స్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. స్కూల్‌లో ప్రస్తుతం 700 మంది బాలికలు ఉన్నప్పటికీ వారికి కేవలం 15 బాత్‌రూమ్స్, బాలురకు 8 ఉండగా అవి సరిపోవడం లేదు. ఇక బాత్‌రూమ్స్‌ను శుభ్రం చేయడానికి స్కావెంజర్‌ను నియమించాల్సి ఉంది.

ఎమ్మెల్యే సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ, స్వామిగౌడ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓ కాలనీలో సమస్యలు ,చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని, కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం బ్రిజేష్, డీజీఎం శరత్‌రెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, స్ట్రీట్‌లైట్స్ ఈఈ మల్లికార్జున్, ఏఈ లిఖిత, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



ప్రసన్నాంజనేయ స్వామికి వడమాల

ఆల్విన్‌కాలనీ: శ్రావణ మాసం మొదటి మంగళవారంను పురస్కరించుకొని కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ ఫేజ్ టులోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో కొలువుదీరిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి వడమాలతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి రామనామ జపం చేశారు. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి

జెడ్సీ ఉపేందర్‌రెడ్డి



గచ్చిబౌలిలో పర్యటిస్తున్న జెడ్సీ ఉపేందర్‌రెడ్డి, అధికారులు

గచ్చిబౌలి: ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులలో శుభ్రత, పచ్చదనం నిర్వహణపై అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని బయోడైవర్సిటీ పార్కు కూడలి, శిల్పారామం, గచ్చిబౌలి, ఇందిరానగర్, మసీద్‌బండ, కొత్తగూడ ప్రాంతాలలో పారిశుద్ధ్యం ,ఇంజనీరింగ్, బయోడైవర్సిటీ విభాగాల అధికారులతో కలిసి జోనల్ కమిషనర్ మంగళవారం పర్యటించారు. రహదారులపై వర్షపునీరు నిలిచే ప్రాంతాలలో తక్షణం మరమ్మతులు చేపట్టాలన్నారు. విభాగాల వారీగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు.కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, డీడీ అనిల్‌కుమార్ తదితరులున్నారు.

విరాళాల సేకరణ

పటాన్‌చెరు టౌన్: కేరళ వయనాడ్ ప్రజలకు అండగా నిలుద్దాం అని సీపీఎం నాయకులుపాండురంగారెడ్డి అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఇస్నాపూర్‌లో విరాళాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, గంగాధర్,ఆంజనేయులు,మూర్తి, విష్ణు ఇతరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం జాబ్ పేరిట మోసం

రూ. 5లక్షల 58 వేలు పోగొట్టుకున్న ప్రైవేటు ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ. 5 లక్షల 58 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ తేజ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి జూలై 13వ తేదీన పార్ట్‌టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును, సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ. 5 లక్షల 58 వేలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్‌కు ఘన నివాళి



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రొ. జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సెంటర్‌లో ప్రొ. జయశంకర్ జయంతిని మంగళవారం నిర్వహించారు.కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వీరేశంగౌడ్, మల్లికార్జునశర్మ, రాజేశ్వరమ్మ, గోవిందాచారి, శ్రీకళ, సాయన్న, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో..



ఖాజాగూడలో..

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో మంగళవారం జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి నిర్వహించారు. తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జయశంకర్ తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. తెలంగాణ సాధనలో తనదైన శైలిలో ఉద్యమాన్ని ముందుకు నడిపేలా పాటలను రాసి తనవంతు పాత్రను గద్దర్ నిర్వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు తప్పనిసరి

మణికొండలో పర్యటించిన సీడీఎంఏ గౌతమ్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో 300గజాలకు పైన నిర్మించే అపార్ట్‌మెంట్‌లలో ఇంకుడు గుంతల ఏర్పాటును తప్పనిసరి చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావుతో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా మణికొండ 13వ వార్డులోని మర్రిచెట్టు సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఇంకుడు గుంత నిర్మాణ పనులను ప్రారంభించారు. కొత్తగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించి ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని చెత్త డంపింగ్ యార్డు, వర్మికంపోస్టు ఎరువుల తయారీని పరిశీలించారు. గండిపేటలో నీటి సరఫరాలో క్లోరినేషన్ కలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల పరిధిలో పారిశుద్ధ్యం, పచ్చదనాన్ని పెంపొందించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీలలో ఉన్న పార్కులను పరిరక్షించటంతో పాటు వాటిల్లో పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. మణికొండలో పార్కుల అభివృద్ధిని ఎందుకు పట్టించుకోవటం లేదని కమిషనర్, ఏఈ, టీపీవోలను ప్రశ్నించారు. ప్రతి పార్కును వెంటనే అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, దానిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటిలో ఎక్కడా లీకేజీలు లేకుండా నాణ్యమైన నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమాల్లో మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, కమీషనర్ డి. ప్రదీప్‌కుమార్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, కమీషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పలు శాఖల అధికారులు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ కాలనీ సమస్యలు పరిష్కరించండి



జలమండలి అధికారికి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలో డ్రైనేజీ, మంచి నీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధిబృందం జలమండలి అధికారులకు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. గచ్చిబౌలిలోని రంగారెడ్డి జిల్లా టీఎన్‌జీఓ గవర్నమెంట్ ఎంప్లాయిస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి జంగయ్య నాయకత్వంలో ప్రతినిధి బృందం జలమండలి అధికారులను కలిశారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలను వివరించారు. ముఖ్యంగా డ్రైనేజీ, మంచినీటి సరఫరా సరిగ్గా లేదని, కాలనీవాసులు ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. కాలనీలో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పనిచేయడం లేదని నీటి సరఫరా సమయం పెంచాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జోసఫ్, వెంకటయ్య, రాజారామ్, ఎం రాములు, సుగుణరెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, డీసీ రజనీకాంత్‌రెడ్డితో కలిసి స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్త జీవకోటికి ప్రాణాధారం మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. కాలనీలు,బస్తీలలో రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాలలో మొక్కలు నాటాలన్నారు. కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు విశాలాక్షి, జగదీష్, విక్రమ్‌చంద్ర, మల్లికార్జున్, లిఖిత, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



గోపన్‌పల్లిలో మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్ నడిగడ్డతండాలో..

మియాపూర్: పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత అని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్ నడిగడ్డతండాలో స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ హాజరై స్థానికులకు మొక్కలను పంపిణీ చేశారు. డీఈ దుర్గాప్రసాద్, వార్డు ఆఫీసర్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు, నడిగడ్డతండావాసులు పాల్గొన్నారు.

చందానగర్‌లో..

చందానగర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని భవానిపురం కాలనీలో మంగళవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంను స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు.



మియాపూర్ నడిగడ్డతండాలో మొక్కలు పంపిణీ చేసిన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు

శరవేగంగా రహదారి విస్తరణ పనులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ నుండి వాణినగర్ వరకు రహదారి విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రోడ్డు పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం పూర్తయితే.. అమీన్‌పూర్ నుండి వాణి నగర్ మీదుగా ఆర్టీసీ కాలనీ, పీజీఆర్ కాలనీ, మాధవపూర్ హిల్స్ తదితర కాలనీలకు సౌకర్యం కలుగుతుందన్నారు.ఈ రోడ్డు నిర్మాణానికి రూ.15 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. కౌన్సిలర్ కల్పన ఉపేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రాములు, నాయకులు పాల్గొన్నారు.

కాముని చెరువు.. శుద్ధి ఎప్పుడు?

- కాలుష్యకాసారంగా 53 ఎకరాల చెరువు
- తాజాగా ఎస్‌టీపీ కేటాయింపులోనూ లేని కాముని చెరువు



శంషాబాద్: శంషాబాద్ ప్రజలకు సాగునీరు.. తాగునీరు అందించిన నిజాం కాలం నాటి కాముని చెరువు మూడు దశాబ్దాలుగా మురుగునీటి చెరువుగానే మిగిలిపోయింది. ఎస్‌టీపీ (మురుగు నీటి శుద్ధి ప్లాంట్) ఏర్పాటుకు సంబంధించి గత ఆరేళ్లుగా చేస్తున్న ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలు అవుతున్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలోని అనేక చెరువులకు ఎస్‌టీపీలను ఏర్పాటు చేశారు. తాజాగా రెండు రోజుల కిందట కూడా కేటాయించిన ఎస్‌టీపీల కేటాయింపులో కాముని చెరువు లేకపోవడంపై స్థానికులు నిట్టూరుస్తున్నారు.

మురుగు పరుగంతా సాగర్ వైపే..

పట్టణానికి ముఖద్వారంగా ఉన్న కాముని చెరువు మొత్తం 53 ఎకరాల్లో విస్తరించి ఉంది. శంషాబాద్ మున్సిపాలిటీలోని పాత గ్రామంలోని మురుగునీటి డ్రైన్లన్నింటిని కూడా ఇందులోనే కలిపేశారు.వీటితో పాటు ఎగువ ప్రాంతం గుండా వచ్చే వర్షపునీరంతా కూడా ఇందులోనే చేరుతుంది. చెరువు నుంచి కిందికి ప్రవహించే నీరు జాతీయరహదారి కింది నుంచి దోసికుంట అక్కడి నుంచి సిద్దులగుట్ట పక్క నుంచి కొత్వాల్‌గూడ నుంచి నేరుగా హిమాయత్‌సాగర్‌లోనే కలుస్తున్నాయి. సాగర్‌నీరు కలుషితంలో శంషాబాద్ కాముని చెరువు కూడా భాగంగా మారుతోంది.

పట్టింపు లేదు..

కాముని చెరువులోకి మరో రెండు డ్రైన్లు ప్రతిపాదించిన అధికారులు చెరువు వద్ద మురుగునీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటుకు ప్రతిపాదించారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఒత్తిడి లేకపోవడంతో ఎస్‌టీపీ ఏర్పాటుపై ఉలుకుపలుకు లేకుండా పోతోంది. పటణం నడిబొడ్డున ఉన్న చెరువు కంపుకొడుతున్నాపట్టించుకోకపోవడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువుకు సమీపంలో ఎస్‌టీపీ ఏర్పాటుకు కావల్సినంత భూమిని కేటాయించే పరిస్థితులు లేకపోవడంతో అడుగు ముందుకు పడడంలేదన్న వాదనలున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో దృష్టి పెడితే కాముని చెరువుకు ఎస్‌టీపీ ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాల సుందరీకరణకు అవకాశముంటుంది.

కేటాయించలేదు..

కాముని చెరువు ఎస్‌టీపీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు కేటాయించలేదు. చెరువు సంబంధించి..ఏర్పాటుకు ఉన్న సాంకేతిక అడ్డంకులపై త్వరలోనే సమీప ప్రాంతాల్లో పర్యటించి మళ్లీ ప్రతిపాదనలు పంపిస్తాం.

– బి. సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్